క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లికి పూజలు



ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని పొన్నతోట గ్రామంలో భక్తులు శుక్రవారం పెద్దమ్మతల్లి చతుర్దశ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలను ఆలయ కమిటీ అధ్యక్షుడు శింగనమల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. జమ్మలమడుగు, మోరగుడి, తాడిపత్రి, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మ వారికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామాంజనేయులు, సెక్రటరీ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

ముద్దనూరు : రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నిబంధనలు పాటించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు రిజిస్టర్లు సక్రమంగా అమలు చేయాలని, అనుమతి వున్న వాటిని మాత్రమే విక్రయించాలని ఆయన సూచించారు.

హైవే విస్తరణ పనులను పరిశీలించిన ఆర్డీవో



కమ్మవారిపల్లెలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి 4 లేన్ల రహదారి విస్తరణ పనులను ఆర్డీవో శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. రహదారి విస్తరణలో తమ నివాసాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండలంలోని కమ్మవారిపల్లె గ్రామస్తులు గురువారం ఆర్డీవోకు విన్నవించారు. ఈ నేపథ్యంలో నేషనల్ హైవే అధికారులతో కలిసి ఆర్డీవో కమ్మవారిపల్లెలో చేపడతున్న మార్కింగ్ పనులను పరిశీలించారు. నిబంధలన మేరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నామని, వీలైనంత వరకు నిర్వాసితులకు ఇబ్బందిలేకుండా చూస్తామని ఆయన తెలిపారు. తహసీల్దారు సువర్ణదేవి, ఎన్‌హెచ్ ఏఈ దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైళ్ళు ఆపాలని డీఆర్‌ఎంకు వినతి

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్‌లో గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ వినీత్‌సింగ్ శుక్రవారం పర్యటించారు. ఇటీవలే రైల్వేస్టేషన్‌లోని పాత భవనాలను కూల్చివేసిన ప్రాంతాన్ని, రైల్వేక్వార్టర్స్‌ను ఆయన పరిశీలించారు. స్థానిక స్టేషన్‌లో రైల్వే సిబ్బందికి, క్వార్టర్స్‌కు వినియోగించేటందుకు వాటర్‌ప్లాంట్‌ను పునర్మించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు బీజేపీ నాయకులు డీఆర్‌ఎంను కలిసి రద్దయిన పలు రైళ్ళకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని వినితిపత్రం అందించారు. ధర్మవరం–మచిలీపట్నం, ముంబయి–చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లను ముద్దనూరు స్టేషన్‌లో ఆపాలని రామాంజనేయులరెడ్డి, రమణ, మోహన్‌గుప్త, ప్రతాప్‌రెడ్డిలు కోరారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

మోటర్ వెహికల్ సవరణ చట్టం 2019 రద్దు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మోటర్ వెహికల్ సవరణ చట్టం 2019ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న వాహన యజమానులు, వ్యక్తిగత వాహనంపై కూడా భారం మోపుతూ ప్రభుత్వం వెహికల్ స్క్రాపింగ్ పాలసీని తీసుకొచ్చిందన్నారు.

యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది

కమలాపురం : యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, ఆసనం–ఆరోగ్య శాసనం అని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో ప్రపంచ 10వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు చేయించారు. వామప్, సూర్య నమస్కారాలు, అడ్వాన్స్‌డ్ పిరమిడ్ తదితర ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరం యొక్క ముఖ్య ఉద్దేశం స్వీయ మరియు సమాజం కోసం యోగా అని ప్రకటించారని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో శారీరక, మానసిక ఉల్లాసం కోసం, ఆరోగ్యం కోసం, యోగా చేయాలన్నారు. చదువులో ఏకాగ్రత పెరగడంతో పాటు ఎలాంటి రోగాలు దరి చేరవని సూచించారు. యోగ చేయడం ద్వారా శారీరక, మానసిక ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పాటు స్థానిక ప్రజ లు యోగాసనాలు వేశారు. అనంతరం యోగా ప్రత్యేకత గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివకిషోర్‌రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ప్రశాంతి, మండల ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ ఓబయ్య, రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

పులివెందుల టౌన్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని లయోలా పాల్‌టెక్నిక్ (వైఎస్ఆర్ఆర్) కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టో తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆడిటోరియంలో యోగా గురువు వెంకటరామిరెడ్డి విద్యార్థులకు యోగాపై అవగాహన నిర్వహించారు. యోగా సాధన గురించి, యోగా చేయడంవల్ల కలిగే ప్రయోజనాల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. అలాగే పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ యోగాసనాలు చేయించారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ యూనిట్–1 తరపున నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణారెడ్డి పాల్గొని యోగా గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, అధ్యాపకులు సుధీర్, తదితరులు పాల్గొన్నారు. వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల కళాశాలలో యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని నెహ్రూ యువకేంద్రం, స్నేహితఅమృతహస్తం సేవా సమితి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు యోగా గురువు వెంకటరామిరెడ్డి యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి నాగేంద్రమ్మ, సేవాసమితి అధ్యక్షులు రాజులు పాల్గొన్నారు. అలాగే ఏపీ కార్ల్‌లోని ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాలలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కె.ఎన్.శ్రీనివాసులు, అకడమిక్ అధికారి హరిప్రసాద్, అధ్యాపకులు శ్రీనివాసులు, యోగా టీచర్లు నాగరాజు, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : యోగాతోనే ఆరోగ్యం మహాభాగ్యమని పులివెందుల సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో యోగా డే సందర్భంగా పులివెందుల పట్టణంలోని సివిల్‌జడ్జి కోర్టు ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమాజంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతీ ఏడాది జూన్ 21న జరుపుతున్నారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ నరసింహారెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మానసిక వత్తిడిని దూరం చేసేది యోగా అని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దీపికా తెలిపారు. శుక్రవారం యోగ దినోత్సవం సందర్భంగా ఆమె సిబ్బందితో కలసి యోగ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న ప్రపంచంలో అందరు యంత్రాలుగా పనిచేయడం జరుగుతుంది. మానసిక వత్తిడిపెరిగి మనుష్యుల్లో బీపీ, షుగర్‌లు పెరిగి అనారోగ్యాలకు గురి అవుతున్నారు. ప్రతి ఒక్కరు రోజు గంట పాటు యోగ చేయడం ద్వార ఎంతో ఆనందంగా జీవితంగా సాగుతుందని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రతి రోజు యోగ చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగ దినత్సోవం సందర్భంగా కోర్టు ఆవరణలో యోగ కార్యక్రమాన్ని జడ్జి నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి రోజు అరగంట పాటు యోగ చేయడం వల్ల శారీరక సమస్యలు తొలగిపోయి ఆరోగ్యంగా ఉంటారని ఆమె సూచించారు. ఈనెల 29వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.భాగ్యలక్ష్మీ యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తల్లిశెట్టి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రయోజనాలను వివరంగా తెలియజేశారు. హెచ్ఎం నారాయణమ్మ, పీడీ తేజేంద్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ యోగ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు ఉషారాణి, పీఈటీ భారతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : యోగాతో ఒత్తిడి, ఆందోళన దూరమవుతాయని ఎంపీడీఓ సల్మాన్‌రాజ్ తెలిపారు. అంతర్జాతీయ యోగాదినోత్సవం పురష్కరించుకుని శుక్రవారం మండల పరిషత్ ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు.



కమలాపురం : జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : యోగ భారతీయ వారసత్వ సంపద అని ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను భాగస్వామ్యం చేసుకుని మంచి ఆరోగ్యాన్ని పొందాలని యోగా గురువులు తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో బీజేపీ మండలాధ్యక్షుడు మేకల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం మండలంలోని నాగలగుట్టపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవకుమార్ తోపాటు విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ యోగాకు తగిన ప్రాధాన్యత నిచ్చి అంతర్జాతీయ దినోత్సంగా ప్రకటించారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సోము దశరథ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో ఎంఈఓ గంగిరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు చెన్నూరు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపురంలో

కొండాపురం : కొండాపురం గురుకుల పాఠశాలలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణమ్మల ఆధ్వర్యంలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కమలాపురం డిగ్రీ కళాశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



పులివెందులలో వ్యవసాయ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పులివెందులలో యోగాసనాలు వేస్తున్న జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు



జమ్మలమడుగులో యోగా చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



వేంపల్లెలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



సింహాద్రిపురంలో యోగా చేస్తున్న ఎంపీడీఓ సల్మాన్ రాజ్, తదితరులు



యోగాసనాలు వేస్తున్న వైఎస్‌వీఆర్ఎం బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు

రాచకుంటపల్లె వాసికి డాక్టరేట్ ప్రధానం

వేముల : మండలంలోని రాచకుంటపల్లె గ్రామానికి చెందిన నందినిరెడ్డికి డాక్టరేట్ ప్రధానం చేశారు. నందినిరెడ్డి ఆచార్య ఎన్జీరంగ అగ్రికల్చర్ వ్యవసాయ యూనివర్సిటీ నందు డాక్టరేట్ సాధించారు. సజ్జ పంట నూతన వంగడాల పరిశోధనపై డాక్టరేట్ దక్కింది. సజ్జపంట ఎండలు తట్టుకుని తక్కువ వర్షపాతం ద్వారా ఎక్కువ దిగుబడి ఇచ్చే పంట విత్తనాల కోసం చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంజనాథరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్–ఐఐఎంఆర్ సంస్థలో పరిశోధనలు చేశారు. రాజస్థాన్ నుంచి సేకరించిన విత్తనాలను తెలంగాణ ప్రాంతంలో పరిశోధన చేశారన్నారు. నందినిరెడ్డికి డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు భర్త క్రాంతి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. క్రాంతి కుమార్ అనంతపురం జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న నందినిరెడ్డి

ఫిజియోథెరపీపై ఒక్కరోజు శిక్షణ

వేంపల్లె : మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల యందు ఫిజియోథెరపీ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిజాం ఫిజియోథెరపీ సంస్థ హైదరాబాద్‌కు చెందిన ఫిజియోథెరపీస్టులు రమేష్, వెంకటరమణల ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయిన్ కిల్లర్ వాడకుండా ఫిజియోథెరపీ చేసుకునే విధానం, మొబైల్ వాడకం వల్ల వచ్చే సైడ్‌ఎఫెక్ట్స్ గురించి, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఎలా మొబైల్ వాడాలి, తలనొప్పి, మెడనొప్పి, పెరాలసిస్ వంటి వాటికి ఎటువంటి వ్యాయామం చేయాలి తదితర అంశాలపై వివరించారు.

అదేవిధంగా కావ్య అనే వినికిడి లోపం ఉన్న చిన్నారికి వినికిడి యంత్రాన్ని ఎంఈఓ జాఫర్ సాదిక్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, బాలుర పాఠశాల హెచ్ఎం శివమునెమ్మ, ఫిజియోథెరపీ ఆనంద, భవిత కేంద్ర ఐఈఆర్టీలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్

‘నేను బడికి పోతా’పై ర్యాలీ

లింగాల : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండు వరకు ఇన్‌చార్జి ఎంఈఓ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండులో మానవహారం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈఓ మాట్లాడుతూ చదువుకోవడం పిల్లల హక్కు.. చదివించడం పెద్దల బాధ్యతన్నారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి మాట్లాడుతూ నేను బడికి పోతా కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 13లోగా మండలంలో బడికి పోని పిల్లలను గుర్తించాలని డ్రా పౌట్స్ లేరనే డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లింగాల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించాలనడం బాధాకరం

చెన్నూరు : యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కొందరు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తొలగించమని వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం అందించడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి గుమ్మళ్ల సాయికుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ ఒకప్పుడు యోగి వేమన విశ్వవిద్యాలయం కడప జిల్లాకు వచ్చేందుకు ఆయన ఎంతో కృషి చేయడంతో పాటు, విద్యా వ్యవస్థకు ఆయన చేసినటువంటి కృషి మరువలేనిదన్నారు. అలాంటి మహానుభావునికి ఆనాడు పలాభిషేకం చేసిన యోగివేమన విశ్వవిద్యాలయంలో నేడు ఆయన విగ్రహాన్ని తొలగించాలని కోరడం దుర్మార్గమన్నారు. డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి నేడు మంచి మంచి పదవులలో హోదాలలో ఉన్నారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని తొలగించాలని కోరడం మానుకోవాలని ఆయన కోరారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలో ఉన్న శ్రీ వీర నారాయణస్వామి అందుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం లింగాల మండలం కర్ణపాపయ్యపల్లె గ్రామానికి చెందిన వెన్నపూస జయరామకృష్ణారెడ్డి కుమారుడు సుజిత్ రెడ్డి 13వ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో విద్యార్థుకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వై.రమణారెడ్డి, వారి కుమారుడు ఆకాష్‌రెడ్డిలు పేద విద్యార్థులకు రూ.8 వేలు విలువ చేసే విద్యా సామగ్రిని అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సుబ్బిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ విద్యాసామగ్రిని మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు దాతలు, పూర్వ విద్యార్థులు వారికి తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ఘనంగా పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ చౌడేశ్వరీ మాత

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో పౌర్ణమిని పురష్కరించుకుని శుక్రవారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి అర్చకులు చౌడేశ్వరీ మాతకు విశేష పూజలను నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దోమలు వ్యాప్తి చెందకుండా నివారించండి


వేముల : గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా నివారించేందుకు డ్రై డే పాటించాలని డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఖాజామొయిద్దీన్ తెలిపారు. మండలంలోని వేల్పుల గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. మన ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెడతాయని, ఆ గుడ్ల నుండి లార్వా, లార్వా నుండి దోమగా మారేందుకు 10 రోజుల సమయం పడుతుందన్నారు. లార్వా దోమగా మారకముందే నీరు నిల్వ ఉన్న తొట్లు, డ్రమ్ములలోని నీటిని పారబోసి కడిగి శుభ్రపరచి ఆర బెట్టిన తర్వాత తిరిగి నీటితో నింపుకోవాలన్నారు. ఇది ఖర్చులేని విధానమని, ప్రతి ఒక్కరు అలవాటు చేసుకుని ఈ విధానాన్ని పాటించాలన్నారు. రసాయనాలు వాడనందు వల్ల వాతావరణం కలుషితం కాదని గ్రామమంతా డ్రై డే పాటిస్తే డెంగ్యూ, మలేరియా జ్వరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరి, సీహెచ్ఓ వీణాకుమారి, ఆశాకార్యకర్తలు శాంతి, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరిస్తున్న అధికారి ఖాజామొయిద్దీన్

కోన గవేశ్వరునికి పౌర్ణమి శోభ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని మోట్నూతలపల్లె గ్రామంలో వెలసిన కోన గవేశ్వరుని ఆలయంలో పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పుష్పగిరి ఓబులరెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అప్పటి పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు భక్తుల సహకారంతో సంవత్సరం పాటు పౌర్ణమి పూజలు చేయనున్నారు. ఇందులో భాగంగా 2022 మే నెల నుంచి పౌర్ణమి పూజలు ప్రారంభించి 2024 మే నెల వరకు 25 నెలల పాటు పౌర్ణమి పూజలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని జూన్ 25వ తేదీన శివభక్తుల ప్రోత్సాహంతో 26న పౌర్ణమి పూజలు సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులందరు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు. వివరాలకు 8309041460ను సంప్రదించాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో కోన గవేశ్వరుడు

గండి గంగమ్మ గుడి అభివృద్ధికి చేయూత నివ్వండి

చక్రాయపేట : గండిక్షేత్రంలో ఉన్న పురాతన గంగమ్మ దేవత ఆలయ అభివృద్ధికి భక్తులు చేయూత నివ్వాలని పూజారి సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశాడు. గంగమ్మ ఆలయం గండిలో తలనీలాల కట్టకు ఆనుకుని శిథిలావస్థలో ఉన్న సత్రంలో ఉంది. ఇది చూడటానికి సత్రంలా కనిపిస్తుండటంతో ఇక్కడ గుడి ఉందన్న విషయం భక్తులకు తెలియక అంజన్నను దర్శించు కొని వెళుతుంటారు. పైగా ఆలయం వద్దకు వెళ్లుటకు సరైన దారి వసతి కూడా లేదు. శతాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ ఆలయం అభివృద్ధిలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంటోంది. గత ప్రభుత్వ హయాంలో గండి ఆలయ అభివృద్ధికి రూ.24 కోట్ల మేర నిధులు మంజూరు చేసింది. అప్పటి గండి ఆలయ అభివృద్ధి ప్రణాళికలో గంగమ్మ గుడిని కూడా చేర్చారు. అయితే గండి ప్రధాన ఆలయం అభివృద్ధికే నాటి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిపోయాయి. దీంతో గంగమ్మ ఆలయ అభివృద్ధి మరుగున పడింది. దీంతో గంగమ్మ ఆలయ పూజారి సుబ్బరాయుడు గంగమ్మతల్లి వెలసిన సత్రం స్థానంలో గుడిని కట్టించడంకోసం గండికి వచ్చే భక్తులు గంగమ్మ గుడి అభివృద్ధికి చేయూత నివ్వాలని ఆయన కోరుతున్నారు.



గండి క్షేత్రంలో అభివృద్ధికి నోచుకోని గంగమ్మ గుడి

సబ్సిడీ విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోండి

పెద్దముడియం : ఖరీఫ్ 2024కు సంబంధించి రైతులు సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. మండలానికి కందులు 60 క్వింటాళ్లు, మినుములు 25 క్వింటాళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కందులు 4 కేజీ ప్యాకెట్ పూర్తి ధర రూ.559.2 కాగా సబ్సిడీ రూ.167.7 పోను రూ.391.44, మినుములు 4 కేజీ ప్యాకెట్ పూర్తి ధర రూ.560 కాగా సబ్సిడీ రూ.168 పోను రూ.392 రైతులు చెల్లించాలని రైతులు తెలిపారు. ఒక ఎకరాకు 2 ప్యాకెట్లు, 5 ఎకరాలు ఉన్న రైతులకు గరిష్టంగా 10 ప్యాకెట్లు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.